సాక్షి
తిరుపతి
మంగళవారం । 23 । మే । 2023



కిర్రాక్!

గ్రామీణ క్రీడాకారులు బంతులతో కిర్రాక్ పుట్టిస్తున్నారు. చంద్రగిరి ఐపీఎల్‌లో పదునైన బంతులు సంధించి వికెట్లు నేలకూల్చుతున్నారు. - IIలో



గుప్త నిధుల కోసం శివలింగం తొలగింపు

శ్రీకాళహస్తిలోని పనసకోనలో ఉన్న శివాలయంలో ఆదివారం రాత్రి దుండగులు గుప్తనిధుల కోసం శివలింగాన్ని తొలగించారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	39	26
చిత్తూరు	39	27
తిరుమల	36	23
గూడూరు	41	29
నగరి	41	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో నాలుగు కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,539 మంది స్వామివారిని దర్శించుకోగా.. 39,812 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.72 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టోకెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రామసేతు వంతెన సొగసు చూడతరమా!



సర్వాంగసుందరంగా ముస్తాబవుతున్న రామసేతువంతెన

తొట్టంబేడు(రేణిగుంట): ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్మించిన రామసేతు వంతెన ఇటీవల వందేళ్లు పూర్తి చేసుకుంది. ఇప్పటికే శ్రీకాళహస్తిలో నాలుగు వంతేనలు ఉండగా.. రామసేతు వంతేనపై ప్రస్తుతం వాహన రాకపోకను నిలిపివేశారు. ఇటీవల వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి వంతెనకు మరమ్మతులు చేసి, రంగులు అద్ది ముస్తాబు చేశారు. ఇరువైపులా ఇనుప కమీలు దెబ్బతినకుండా వాటిని కూడా తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. వంతెనపై నూతనంగా తారు రోడ్డు నిర్మించారు. రానున్న వర్షకాలాన్ని, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని వంతేనకు పూర్వవైభవం తేవడంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణయించిన మేరకే ఇసుక తవ్వకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రభుత్వం నిర్ణయించిన మేరకు స్వర్ణముఖినదిలో ఇసుక తవ్వకాలుండాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం చైర్మన్, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇసుక తవ్వకాలపై మైనింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాయుడుపేట మండలం, ఎగువభాగాన కూచివాడ గ్రామంలో 29.6 హెక్టార్లలో 2,96,000 క్యూబిక్ మీటర్లకు 1 మీటర్ లోతు మాత్రమే ఇసుక తీయాలని కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఆ మేరకు మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మైనింగ్ అధికారులు ప్రకాష్‌కుమార్, రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ విజయకుమార్, పంచాయతీ జిల్లా అధికారి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పందనకు 101 ఫిర్యాదులు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 101 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిప్పు రాజేశావు తల్లీ!

అదిగో మంట.. ఇదిగో నిప్పు.. అక్కడ అంటుకుంది.. ఇక్కడ తగలబడుతోంది.. గ్రామానికి అరిష్టం పట్టింది.. గంగమ్మ జాతర చేయకపోవడమే కారణం.. అంటూ కొందరు. భిక్షాటనకు వచ్చిన వ్యక్తి అసంతృప్తితో శాపం పెట్టడం వల్లే గ్రామంలో అశాంతి కలిగిందని మరికొందరు. అయ్యో ఊరుకు ఏదో కీడు చుట్టుకుందని ఇంకొందరు .. ఇలా నెల రోజులుగా తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, కొత్తశానంబట్ల గ్రామంలో వస్తున్న మంటల మిస్టరీ మూలాలను పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఈ మంటలను రాజేస్తోంది బాధిత కుటుంబాల్లో ఒకరైన 19 ఏళ్ల యువతి అని పోలీసులు గుర్తించారు. ఆమె చెప్పిన కారణాలు విని విస్మయానికి గురయ్యారు. మంటల మిస్టరీ వీడడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వీడిన మంటల మిస్టరీ
- తల్లిలో మార్పు రావాలని నిప్పు పెట్టిన కూతురు
- మంటల ముసుగులో ఇంట్లోని రూ.35 వేలను నొక్కేసిన వైనం
- కేసు ఛేదించిన చంద్రగిరి పోలీసులు
- ఊపిరి పీల్చుకున్న కొత్తశానంబట్ల గ్రామస్తులు



కాలిపోయిన దుస్తులు(ఫైల్)



తగలబడిన బీరువా(ఫైల్)

తిరుపతి రూరల్: చంద్రగిరి మండలం, కొత్తశానంబట్ల గ్రామంలో అకస్మాత్తుగా వస్తున్న మంటల మిస్టరీని పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు వంశీధర్ అసలు నిందితులెవరో కనిపెట్టారు. ఆ వివరాలను సోమవారం చంద్రగిరి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) వెంకటరావు వెల్లడించారు. ఆయన మాటల్లోనే... 'గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటర్ ఫెయిల్ అయ్యి ఇంటి వద్దే ఉండి చదువుకుంటోంది. తల్లి ప్రవర్తన ఆ యువతికి నచ్చలేదు. 'మా అమ్మ మారాలంటే మేము మా వూరి నుంచి వెళ్లిపోవాలి' లేదా ఆమెలో ఇలాంటి ప్రవర్తన ప్రేరేపించిన వారు అయినా ఊరు విడిచి వెళ్లాలి..' అని భావించింది. ఆ విధంగా తమ కుటుంబం ఈ గ్రామాన్ని విడిచి వేరే గ్రామానికి వెళ్లిపోతే సమస్య తీరుతుందని భావించి మొదట్లో తన ఇంట్లోనే అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు చేయడం ప్రారంభించింది. తర్వాత తన తల్లి ప్రవర్తనకు కారకులైన వారి ఇంట్లో నిప్పు పెట్టి వారిని భయభ్రాంతులకు గురిచేసింది. ఈ క్రమంలో తను ఎవరికీ పట్టుబడకపోవడంతో ధైర్యంగా వారి కుటుంబానికి, తనకు వ్యక్తిగతంగా మనస్పర్ధలు ఉన్న వారి ఇళ్లల్లో కూడా నిప్పు పెట్టింది. ఇలా గ్రామంలో 12 అగ్ని ప్రమాదాలకు కారకురాలైంది. అన్నీ అగ్గి పుల్లలతోనే కాల్చింది. తన ఇంట్లో బీరువాలోనూ, బెడ్‌పైన, నిద్రపోతున్న తల్లి చీరకు నిప్పు పెట్టడం.. లాంటి ఘటనలు ఫోరెన్సిక్ రిపోర్ట్‌లో ఎటువంటి రసాయనాలు లేకుండా ఈ ప్రమాదాలు జరిగాయని బయటపడింది. ఈ ఘటలన్నీ కూడా ఎవరి సహాయం లేకుండా ఆ యువతి ఒక్కటే చేసిందని పోలీసు విచారణలో తేలింది. ఆ యువతిపై చంద్రగిరి పోలీసులు ఐపీసీ 435, 506 కింద కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకన్నారు. వారి ఇంటి బీరువలో కాలిపోయాయని చెప్పి, తన దగ్గర ఉంచుకున్న రూ. 32,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బును వారం రోజులుగా అండర్‌వేర్‌లోనే దాచి ఉంచడం గమనార్హం.

అభినందించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఎస్పీ

గ్రామస్తుల సున్నితమైన మనోభావాలతో కూడి న ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని పరిష్కరించిన చంద్రగిరి పోలీసులు, ఎస్పీ ఐడీ పార్టీ పోలీసులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

తాంత్రిక, యాంత్రిక చర్యలు లేవు

వరుస అగ్నిప్రమాదాలతో గ్రామస్తులు భయాందోళనలను క్యాష్ చేసుకునేందుకు కొందరు తాంత్రిక, యాంత్రిక చర్యలు జరిగాయనే అనుమానలు వ్యక్తం చేశారు. జనవిజ్ఞాన వేదిక, ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ గ్రామంలో స్థానికులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కాలంలో కూడా ఇలాంటి మూఢనమ్మకాలను నమ్మొద్దని ప్రచారం చేశారు.

పట్టించిన అగ్గిపుల్ల

కొత్తశానంబట్లలో వరుస అగ్ని ప్రమాదాపై జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దేవుడి కోపం అని కొందరు.. భిక్షాటనకు వచ్చిన వ్యక్తి శాపం వల్ల అని మరికొందరు.. క్షుద్రపూజలంటూ ఇంకొందరు ప్రచారం చేశారు. దీంతో గ్రామస్తుల్లో ఆందోళన కనిపించింది. గత నెల 21న ప్రమాదవశాత్తు ఓ గడ్డివామితో ప్రారంభమైన మంటలు ఈనెల 12 నుంచి ఇళ్లల్లోనూ చెలరేగాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. మిస్టరీని ఛేదించేందుకు ప్రత్యేక నిఘా పెట్టారు. ముందుగా గ్రామంలో క్షుద్రపూజలు చేసేవారిని, జులాయిగా తిరిగేవారిని తమదైన శైలిలో విచారించారు. ఊరంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టుబడిన యువతి అన్నను కూడా విచారించారు. బాధిత కుటుంబాల్లోని మహిళలపై కూడా నిఘా పెట్టారు. ఇంటికో మహిళా పోలీసును నియమించారు. అగ్గిపుల్లల ద్వారానే మంటలు అంటుకుంటున్నట్టు ఫోరెన్సిక్ నివేదిక తేల్చింది. నాలుగు చోట్ల దొరికిన అగ్గిపుల్లలు, నిందితురాలి ఇంట్లో ఉన్న అగ్గిపెట్టే నుంచే వస్తున్నట్లు నిర్ధారించారు. జరిగిన సంఘటన వద్ద యువతి ఆనవాళ్లు లభించడం, నాలుగైదు చోట్ల ఒకే తరహా అగ్గిపుల్లలను వాడడం, అవి ఆ యువతి ఇంట్లో ఉన్న అగ్గిపెట్టెతో సరిపోలడంతో ప్రత్యేక నిఘా ఉంచారు. ఆమె వద్దే కాలిపోయాయని చెప్పిన రూ.32,500 నగదు పట్టుబడడం, అవి తన శరీరంలోనే రహస్య ప్రదేశంలో దాచాల్సి రావడంపై అనుమానం వచ్చి విచారించడంతో అసలు నిజం బయటపడింది.



మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటరావు, డీఎస్పీ యశ్వంత్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరికీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈమేరకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం ప్రతిజ్ఞ చేయించారు. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అనే అంశంపై కలెక్టర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయుడుపేట, పుత్తూరు, సూళ్లూరుపేట, తిరుపతి, మునిసిపల్ కమిషనర్లు శ్రీనివాసులు, కేఎల్ఎన్ రెడ్డి, నరేంద్రకుమార్, సునీత, జిల్లా ఫారెస్ట్ అధికారి సతీష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఎస్ఈ శంకర్‌నారాయణ, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా మైనింగ్ అధికారి ప్రకాష్‌కుమార్, డీఈఓ శేఖర్, జిల్లా పరిశ్రమల శాఖల అధికారి ప్రతాప్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ జ్యోతి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, జిల్లా సూక్ష్మ నీటి సేద్య అధికారి సతీష్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

జీవవైవిధ్యాన్ని పరిరక్షిద్దాం

- రాష్ట్రంలో ఇంటింటికీ ఔషధ మొక్కలు
- అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, తిరుపతి: జీవవైవిధ్యాన్ని తిరిగి నిర్మిద్దామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో సోమవారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం-2023 ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పెద్దిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మానవాళి మనుగడకు జీవవైవిధ్య పరిరక్షణ అవసరమన్నారు. జీవవైవిధ్య చట్టం- 2002, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం 2006లో జీవవైవిధ్య మండలి ఏర్పాటుచేసి రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లో ప్రజా జీవవైవిధ్య రిజిస్టర్ (ఈ-పీబీఆర్)ను సిద్ధం చేసిందన్నారు.

ఇంటింటికీ ఔషధ మొక్కలు

రాష్ట్రంలో ఇంటింటికీ ఔషధ మొక్కల పంపిణీలో భాగంగా 13 వేల స్వయం సహాయక సంఘాల ద్వారా 5.82 లక్షలు మొక్కలు, 11 నర్సరీల ద్వారా 6.6 లక్షల ఔషధ మొక్కలు పంపిణీ చేసినట్టు తెలిపారు. జీవవైవిధ్య పార్కులు, జీవవైవిధ్య మ్యూజియంలు, జీవవైవిధ్య వారసత్వ ప్రదేశాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, జీవవైవిధ్యాన్ని సుస్థిరమైన విధానాల్లో వినియోగించడం, జీవవనరులు వాణిజ్యపరంగా వినియోగం ద్వారా వచ్చిన ప్రయోజనాలను హక్కుదారులకు సమానంగా పంపిణీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యాచరణ ప్రణాళిక మేరకు 2030 ఒప్పందంలో ఉన్న అన్నింటినీ అమలు చేయనున్నట్టు తెలిపారు. 2050 నాటికి సురక్షితమైన, సుస్థిరమైన జీవవైవిధ్యాన్ని సాధించేందుకు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బయోడైవర్సిటీ బోర్డ్, యోగి వేమన విశ్వవిద్యాలయం, మత్స్యశాఖ, నేషనల్ గ్రీన్ కార్పొరేషన్‌తో పాటు.. ఫారెస్ట్ జువాలాజికల్‌పార్క్ సంయుక్తంగా జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయశాఖ, పరంపర వైద్య మహా సంఘం పుత్తూరు ఆయుర్వేద నిలయం, డీఆర్డీఏ వారు చిరుధాన్యాల ప్రాధాన్యత, విద్యవిద్వాన్ బద్వేల్ ఆయుర్వేదం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఫారెస్ట్‌శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జీవవైవిధ్యాన్ని తిరిగి నిర్మిద్దాం అని మిషన్ లైఫ్ సెల్ఫీ తీసుకున్నారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జీవవైవిధ్య మండలి చైర్మన్ బీఎంకే.రెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్‌కే.గోపీనాథ, టీటీడీ బోర్డ్ మెంబర్ పోకల అశోక్‌కుమార్, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల జీవవైవిధ్య మండలి సభ్యులు పాల్గొన్నారు.



జీవవైవిధ్య నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అధికారులు

జిల్లా అభివృద్ధికి చంద్రబాబు అడ్డుకట్ట

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర విషయం అటుంచితే సొంత జిల్లా అభివృద్ధికి చంద్రబాబు అడ్డుకట్ట వేస్తుండడం చిత్తూరు జిల్లా వాసుల దౌర్భాగ్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలోని మిట్ట ప్రాంతాలు కరువుతో అల్లాడుతున్నాయని, ఇక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు మూడు రిజర్వాయర్ల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే, దీనిని అడ్డుకోవడానికి కుట్రపూరితంగా సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చిన ఘనుడు చంద్రబాబని ధ్వజమెత్తారు. మన రాష్ట్రానికి విస్తారమైన తీర ప్రాంతం ఉందని, ఇలాంటి వనరుని ఉపయోగించుకుని పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల ద్వారా గణనీయమైన అభివృద్ధి సాధించాలన్నదే ముఖ్యమంత్రి తాపత్రయమన్నారు. అన్ని అనుమతులు వచ్చాకనే మచిలీపట్నం పోర్టుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే గతంలో చంద్రబాబు మచిలీపట్నం పోర్టుకు శంకుస్థాపన చేయడం కేవలం ఎన్నికల లబ్ధి కోసమేనని తూర్పారబట్టారు. మందకృష్ణ మాదిగ పేమెంట్ ఆర్టిస్ట్ అని, వాస్తవాలతో పనిలేకుండా చంద్రబాబు స్క్రిప్టును వల్లించడమే అతని పని అని ఎద్దేవా చేశారు.

ప్రథమ చికిత్సకు ప్రాధాన్యం ఇవ్వండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: ప్రాథమిక స్థాయిలో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం ఆయన తమ చాంబర్‌లో పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బందికి వివిధ అంశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ డీవీఆర్.కిరణ్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ లోనే పాము కాటుకు ప్రథమ చికిత్స అందించాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీ నివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఆరు రోజుల పాటు సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్‌లో నలభైమంది చొప్పున పదకొండు బ్యాచ్‌లకు ఆరు రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు, సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ లక్ష్మణనాయక్, డాక్టర్ అరుణ సులోచనాదేవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మేరియా, రోజమ్మ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బాబు నెహ్రూరెడ్డి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 122 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ రమేష్ తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 47,885 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూన్ 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3వ తేదీ పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయన్నారు.

జూన్ 5 నుంచి ప్రాక్టికల్స్

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలు జూన్ 5 నుంచి 9వ తేదీ వరకు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

నిమిషం ఆలస్యమైనా..

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆర్ఐఓ స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వెబ్‌సైట్లో ఇంటర్ హాల్‌టికెట్లు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే ప్రథమ, ద్వితీయ సంవత్సర జనరల్, ఒకేషనల్ విద్యార్థుల హాల్‌టికెట్లు 'బీఐఈ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్లో ఉంచినట్లు రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యామండలి కార్యదర్శి ఎంవీ.శేషగిరిబాబు తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు ఇదివరకు హాల్‌టికెట్ నంబరుతో ప్రస్తుత సప్లిమెంటరీ థియరీ పరీక్ష హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, తొలిసారిగా ప్రథమ సంవత్సర సప్లిమెంటరీకి హాజరయ్యే విద్యార్థులు వారి ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ నంబరుతో సప్లిమెంటరీ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఇదివరకు హాల్‌టికెట్ నంబరుతో సప్లిమెంటరీ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, వీటిపై సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్ సంతకం అవసరం లేదని తెలిపారు.

అర్జీలకు పరిష్కారం చూపించాలి


అర్జీలను స్వీకస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు ఎస్‌డీసీ కోదండ రామిరెడ్డి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 142 అర్జీలందగా అందులో అత్యధికంగా 113 వినతులు రెవెన్యూశాఖకు చెందినవే ఉన్నాయని తెలిపారు.

క్రీడాకారులను అభినందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



హర్షిత్‌రెడ్డి వీరోచిత బ్యాటింగ్



కిర్రాక్!

- ఉత్కంఠ భరితంగా.. చంద్రగిరి ఐపీఎల్
- పోటీల్లో హోరాహోరీగా తలపడ్డ గ్రామీణ యువత
- క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేసిన మోహిత్‌రెడ్డి
- మ్యాచ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తున్న హర్షిత్‌రెడ్డి


విజేతలకు అవార్డులను అందిస్తున్న టోర్నమెంట్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిక్రిష్ణ

తిరుపతి రూరల్: చంద్రగిరి ఐపీఎల్‌లో గ్రామీణ క్రీడాకారులు బంతులతో కిర్రాక్ పుట్టిస్తున్నారు. నిప్పులు చెరిగిన బంతులు సంధించి వికెట్లు నేలకూల్చుతున్నారు. అత్యుత్తమ బ్యాటింగ్‌తో ప్రత్యర్థుల గుండెల్లో పరుగులు పెట్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంటలో నిర్వహిస్తున్న ఈ పోటీలు ప్రస్తుతం చివరి దశకు చేరాయి. ఇప్పటికే విజయం సాధించిన వందలాది జట్లు రెండో దశ పోటీల కోసం ఎదురుచూస్తున్నాయి. తొమ్మిదో రోజు సోమవారం 13 క్రీడా మైదానాల్లో 52 జట్లు తపడ్డాయి. మేజర్ పంచాయతీల నుంచి అత్యధిక జట్లు విజయకేతనం ఎగురవేశాయి. ఎక్కడా ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ప్రటిష్ట చర్యలు చేపడుతున్నారు. తొమ్మిదో రోజు కూడా అత్యధిక మంది క్రీడాకారులు, స్థానికులు మ్యాచ్‌లను వీక్షించేందుకు తుమ్మలగుంటకు తరలివచ్చారు.

ప్రతిష్టాత్మకంగా క్రికెట్ టోర్నీ

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. మ్యాచ్ జరిగే ప్రతి గ్రౌండ్‌కు మోహిత్‌రెడ్డి వెళ్లి క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ మెడల్స్, కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అలాగే హర్షిత్‌రెడ్డి టీ షర్టులు, పార్టిసిపేట్ చేసిన ప్రతి ఒక్కరికీ మెడల్స్ పంపిణీ చేస్తున్నారు. మ్యాచ్‌లన్నింటినీ పర్యవేక్షణ చేస్తున్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు మోహిత్‌రెడ్డితో కలిసి తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునిక్రిష్ణ అవార్డులను అందించారు.

విందు.. భలే పసందు

తుమ్మలగుంట వేదికగా జరిగే క్రీడోత్సవంలో క్రీడాకారులకు రుచికరమైన మాంసాహార వంటతో విందు భోజనాలను అందిస్తున్నారు. రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భోజనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. రుచికరమైన వంటలతో తయారైన భోజనం క్రీడాకారులతో పాటు మ్యాచ్‌లను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే యువత సైతం తృప్తిగా స్వీకరిస్తున్నారు. అందరికీ భోజనం అందించేందుకు ఫుడ్ కమిటీలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ చెవిరెడ్డిమోహిత్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.


కొడితే సిక్సే : తుమ్మలగుంట క్రీడా మైదానంలో క్రీడాకారుడి బ్యాటింగ్ విన్యాసం


క్రీడాకారులు, ప్రేక్షకులకు మాంసాహార భోజనం వడ్డిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,790
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,639
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,900
రిటైల్ వెండి గ్రాము	రూ.76.90

కౌటిల్య విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు 15 మంది స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కంబైన్డ్ హయ్యర్ గ్రాడ్యుయేట్ లెవెల్ (ఎస్‌ఎస్‌సీ–సీజీఎల్), ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఎస్‌ఎస్‌సీ తుది ఫలితాల్లో తమ విద్యార్థులు 8మంది ఎస్‌ఎస్‌సీ కేంద్ర ప్రభుత్వ అధీనంలోని వివిధ విభాగాల్లో ఆఫీసర్ ర్యాంకు ఉద్యోగాలు, అలాగే ఇటీవల విడుదలైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) తుది ఫలితాల్లో మరో ఏడుగురు విద్యార్థులు ప్రొబేషనరీ ఆఫీసర్, క్లర్క్ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన జ్ఞాపికలతో సత్కరించారు.

గంగుడుపల్లిలో పరిశీలన

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, గంగులపల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సీఎం 14500కు గ్రామస్తులు ఫిర్యాదు చేయగా మైనింగ్ అధికారులు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆశియా, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ప్రభుత్వ రహదారులు, గ్రావెల్‌తోలే ప్రదేశాన్ని పరిశీలించారు. మైనింగ్ అధికారుల నుంచి అనుమతితోనే గ్రావెల్ తోలుతున్నారని, రోడ్ల పరిస్థితి పై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడికి తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఆశియా హెచ్చరించారు.

ఒకే రోజులో వైద్యం


సాయంత్రం ఓపీ విధానాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా: అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగి ఓపీ చూపించుకున్న రోజే వైద్యులు సూచించిన వైద్య పరీక్షలు, సీటీ, ఎమ్మార్ఐ, ఎక్స్‌రే వంటి పరీక్షలను పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రుయా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సాయంత్రం ఓపీ సేవలను ప్రభుత్వం ఇటీవల ప్రారంభించింది. ఆ మేరకు సోమవారం రుయాలో సాయంత్రం ఓపీ సేవల పనితీరు, నిర్వహణ, లోపాలు తదితర అంశాల పరిశీలనకు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి రుయాకు రోగులు వస్తుంటారని, గతంలో ఓపీ చూసుకున్న తర్వాత వైద్య పరీక్షలు చేసుకోవడం, వాటి రిపోర్టును రెండు రోజుల తర్వాత వైద్యులకు చూపించే పరిస్థితులు ఉండేవన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాయంత్రం ఓపీ విధానం ద్వారా అదే రోజు పరీక్షలు నిర్వహించి, వాటి రిపోర్టును సంబంధిత డాక్టరే చూసి వైద్య సలహాలందిస్తున్నారన్నారు. ఈ నూతన పద్ధతి ద్వారా రోగికి బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. రోజూ మధ్యాహ్నం 3–4 గంటల మధ్య సాయంత్రం ఓపీ సేవలు కొనసాగుతాయన్నారు. ఇలాంటి విధానం దేశంలో ఎక్కడా లేదని చెప్పారు. అనంతరం రోగులతో మాట్లాడి లోటుపాట్లపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై తనిఖీలు నిర్వహించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, ఏవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంలో మేనకూరుకు ఉత్తమ అవార్డు


తిరుపతిలో అవార్డును అందుకున్న కట్టా సుధాకర్‌రెడ్డి

నాయుడుపేట: నాయుడుపేట మండలం, మేనకూరు పంచాయతీకి జీవ వైవిధ్యంలో ఉత్తమ అవార్డు లభించింది. సోమవారం తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జీవవైవిధ్య బోర్డు చైర్మన్ బీఎంకే రెడ్డి చేతులమీదుగా మేనకూరు పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి అవార్డును స్వీకరించారు. జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంలో మేనకూరు పంచాయతీకి అవార్డు వరించినట్లు కట్టా అభిప్రాయపడ్డారు.

పిడుగు పడి రెండు ఆవుల మృతి


ఆవుల కళేబరాల వద్ద భూషణమ్మ

నగరి : మండలంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో మండలంలోని ఎం.కొత్తూరు గ్రామంలో భూషణమ్మ అనే రైతుకు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. ఒక్కో ఆవు సుమారు రూ.70 వేలు విలువ చేస్తుందని బాధితురాలు తెలిపింది. వీఆర్‌ఓ ఘటనా స్థలానికి చేరుకుని ఆవుల కళేబరాలను పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

కుప్పంరూరల్: మండలంలోని గుడ్లనాయనపల్లె– ఓఎన్ కొత్తూరు రహదారిపై కల్వర్టు వద్ద అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న గుడుపల్లె పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎక్కడో కొట్టి చంపి, ఇక్కడ తీసుకువచ్చి పడేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాథముని ఆళ్వార్‌స్వామి దేవస్థాన భూమి స్వాధీనం


దేవస్థాన స్థలంలోని భవనాన్ని సీజ్ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు

తిరుపతి కల్చరల్: యాదవ వీధిలోని శ్రీనాథముని ఆళ్వార్ స్వామి దేవస్థాన భూమిని దేవదాయశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కోర్టు తీర్పు మేరకు దేవస్థాన స్థలంలోని అక్రమ కట్టడాలను వారు సీజ్ చేశారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ డీఈవో టీ.రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ యాదవీధిలో అత్యంత పురాతనమైన శ్రీనాథముని ఆళ్వార్ స్వామి దేవస్థానానికి చెందిన పాత సర్వే నం.422, ప్రస్తుతం తిరుపతి అర్బన్ లెక్కదాఖల మేరకు టీఎస్ నం.3187, 3454లో సుమారు 100 కోట్ల విలువగల 90 సెంట్లు భూమి కె.శ్రీనివాసులు, ఇతరుల ఆక్రమించుకున్నారని, ఆ స్థల విషయాన్ని గుర్తించి తాము 2011లో కోర్టులో కేసు వేసినట్లు వెల్లడించారు. విచారణ అనంతరం కోర్టు ఈ ఏడాది మార్చి 20వ తేదీన సదురు భూమి దేవస్థానానికి చెందినగా తీర్పు వెలువరించిందని, ఈ మేరకు ముందస్తుగా తాము ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో ఈస్ట్ పోలీసులు, రెవెన్యూ, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో సదురు స్థలాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 2011 నుంచి ఆక్రమణదారులు చెల్లించాల్సిన రూ.86.90 లక్షల బకాయిలు ఇప్పటి వరకు చెల్లించలేదని, దీనిపై పిటీషన్ వేయనున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కస్తూరి, గ్రూప్ ఆలయాల ఈవో రామచంద్రారెడ్డి, దేవదాయశాఖ సర్వేర్ రమేష్, దేవదాయశాఖ ఎస్ఐ సుమనప్రియ, వివిధ ఆలయాల ఈవోలు ఎం.మునిక్రిష్ణయ్య (శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ), వి.మునిక్రిష్ణమూర్తి (గాలిగోపురం), ఇ.జయకుమార్ (తలకోన ఆలయం), బి.మునిశేఖర్ (దేశమ్మ ఆలయం, నగిరి), వీఆర్‌వోలు ఎన్.మునికుమారి, వి.మారుతీరావు, ఈస్ట్ ఎస్ఐలు శ్రీనివాసులు, జయస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ పోటీల్లో ప్రతిభ


పోటీల్లో మెడళ్లు సాధించిన హర్షవర్ధన్‌రెడ్డి, జవహర్ సాయిరాం

రేణిగుంట: జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ పోటీల్లో రేణిగుంట, తొట్టంబేడు మండలాలకు చెందిన కుర్రాళ్లు ప్రతిభ కనబరిచారు. రేణిగుంట మండలం, అన్నాసామిపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది పేరూరు మునిరెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, తొట్టంబేడు మండలం, పెద్దకన్నలికి చెందిన భాస్కర్‌రెడ్డి కుమారుడు జవహర్ సాయిరాం ఈనెల 21న అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జరిగిన 2వ జాతీయ ఫ్లోర్ కర్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొన్నారు. ఈ పోటీల్లో రెండు జట్లుగా పోటీ పడిన వీరు గోల్డ్, సిల్వర్ మెడల్లను సొంతం చేసుకున్నారు. వీరికి అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పెమఖండు, రాజ్యసభ సభ్యుడు యోగేశ్వర్ దత్త మెడళ్లను అందజేశారు. అంతకుముందు వీరు నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఓవరాల్ చాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్, ద్వితీయ స్థానంలో అరుణాచల్‌ప్రదేశ్, తృతీయ స్థానంలో హర్యానా జట్లు నిలిచాయి.

గుప్త నిధుల కోసం శివలింగం తొలగింపు


శివలింగాన్ని తొలగించి మండపం ముందు పెట్టిన దుండగులు


శివలింగం తొలగింపుతో ఏర్పడిన గుంత

– గతంలో నంది విగ్రహం కూడా

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తికి కూతవేటు దూరంలోని పనసకోనలో ఉన్న శివాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గుప్తనిధుల కోసం శివలింగాన్ని తొలగించారు. శివలింగాన్ని పూర్తిగా తొలగించి ముందు ఉన్న మండపంలో పెట్టేశారు. అలాగే గతంలోనే శివలింగానికి ఎదురుగా ఉన్న నంది విగ్రహాన్ని కూడా తొలగించిన విషయం తెల్సిందే. ఇదిచాలా పురాతనమైన ఆలయం కావడంతో శ్రీకాళహస్తికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో సోమవారం శివాలయానికి వెళ్తుంటారు. ఆలయానికి పర్యవేక్షణ లేకపోవడంతో దుండగులు ఈదుశ్చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోంది.